సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 31 । ఆగస్టు । 2025



అండగా నిలిచి.. వైద్యం చేసి

ఔటర్, సర్వీస్ రోడ్ల పై ప్రమాదాల బారిన పడుతున్న వారికి ట్రాకా కేర్ సెంటర్లు అండగా నిలుస్తున్నాయి. 8లో ▸



ఏకాగ్రత కోల్పోవద్దు

న్యాయ విద్యార్థులు ఏకాగ్రత కోల్పోవద్దని హైకోర్టు న్యాయమూర్తి నర్సింగ రావు పేర్కొన్నారు. 8లో ▸



అరుపులు.. దాడులు

వీధి కుక్కలు ప్రజలకు కంటి మీద కునుకులే కుండా చేస్తున్నాయి. నిత్యం ఎక్కడో ఓ చోట దాడులు చేస్తున్నాయి. 8లో ▸

అసైన్డ్ అమ్మకాలపై పీఓటీ అస్త్రం!

అసైనీలకు ఆశ చూపి.. గుట్టుగా లీజు అగ్రిమెంట్లు

- పట్టా భూముల్లో కలిపి దర్జాగా విక్రయాలు
- వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు.. పీఓటీ నోటీసులు జారీ
- ఇప్పటికే మంఖాల్‌లో 23.22 ఎకరాలు స్వాధీనం



తుక్కుగూడలో స్వాధీనం చేసుకున్న భూమి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అసైన్డ్ భూముల్లోని అగ్రిమెంట్లపై జిల్లా రెవెన్యూ యంత్రాంగం దృష్టి సారించింది. కొంత మంది రియల్టర్లు తమ పట్టా భూముల పక్కనే ఉన్న అసైన్డ్ భూములను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. అసైన్డ్ దారులతో లీజు ఒప్పందం రాసుకుంటున్నారు. తర్వాత ఆయా భూములను తమ పట్టాభూముల్లో కలిపేసి గుట్టుగా వెంచర్లు చేస్తున్నారు. మరికొంత మందైతే ఏకంగా తమకున్న అధికారాన్ని అడ్డం పెట్టుకుని, వాటిని పట్టా భూములుగా మార్చించుకుంటున్నారు. ఇందుకు క్షేత్రస్థాయిలోని కొంత మంది రెవెన్యూ అధికారులు సహకరిస్తుండటంతో వీరి అక్రమాలకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. నిజానికి అసైన్డ్ భూములను అమ్మడం కానీ కొనడం కానీ నేరం. ఎవరైనా క్రయవిక్రయాలకు పాల్పడితే.. ప్రభుత్వం పీఓటీ (అసైన్డ్ లాండ్ ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్) యాక్ట్–1977 కింద తిరిగి స్వాధీనం చేసుకునే అవకాశం కల్పించింది. ప్రభుత్వ భూముల పరిరక్షణలో భాగంగా అధికారులు ఇటీవల ఈ చట్టానికి పదును పెడుతున్నారు. అసైన్డ్ భూములు అమ్మినట్లు, కొన్నట్లు ఏమాత్రం తెలిసినా వెంటనే నోటీసులు జారీ చేస్తున్నారు. ఇప్పటికే మహేశ్వరం మండలం మంఖాల్‌లో 23.22 ఎకరాలను స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు.. తాజాగా మరికొంత మందికి నోటీసులు జారీ చేసేందుకు సన్నద్ధం అవుతున్నారు. దీంతో ఇప్పటికే ఆయా భూములను కొనుగోలు చేసిన అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నాగన్‌పల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 189 అనాజీపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 281లోని అసైన్డ్ భూములపై రియల్టర్ల కన్నుపడింది. ఓ రియల్ ఎస్టేట్ కంపెనీ ఈ భూములను గుట్టుగా కొనుగోలు చేసిన విషయం తెలిసి రెవెన్యూ అధికారులు పీఓటీ కింద నోటీసులు జారీ చేశారు. హయత్‌నగర్ మండలం తుర్కయంజాల్ సర్వే నంబర్ 52/8లోని 25 ఎకరాలు ఇప్పటికే చేతులు మారినట్లు గుర్తించారు. నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్లు జారీ చేసిన అప్పటి మండల రెవెన్యూ అధికారి, ఇన్‌స్పెక్టర్లపై చర్యలకు సిఫార్సు చేశారు. హయత్‌నగర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 242లోని ఐదు ఎకరాల అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకున్నారు. తర్వాత ఈ భూములను బస్ టెర్మినల్ కోసం కేటాయించారు.

చేవెళ్లలో..

చేవెళ్ల డివిజన్ పరిధిలోని పెద్దవీడు, మద్దూరు, సోలిపేట్ గ్రామాలు సహా శంకర్‌పల్లి మండలాల్లో వంద ఎకరాలకుపైగా పీఓటీ కింద స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 177, 176లోని 30 ఎకరాలు, కనకమామిడి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 51, 510లోని దాదాపు 50 ఎకరాలు, తోల్‌కట్ట రెవెన్యూ సర్వే నంబర్లు 142,143, 85లోని పది ఎకరాలపై రియల్టర్ల కన్నుపడింది. పదేళ్ల క్రితమే ఈ భూములు చేతులు మారాయి. విషయం తెలిసి అప్పట్లోనే రెవెన్యూ యంత్రాంగం పీఓటీ కింద వెనక్కి తీసుకుంది. తర్వాత మళ్లీ ఆయా భూములు ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లాయి. చిలుకూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 632లోని 58 ఎకరాల అసైన్డ్ భూములపై కూడా రియల్టర్లు కన్నేశారు. ఈ భూములను పీఓటీ కింద స్వాధీనం చేసుకుని అప్పట్లోనే హెచ్ఎండీఏకు అప్పగించారు. శంకర్‌పల్లి మండలం మోకిల రెవెన్యూ పరిధి సర్వే నంబర్లు 96,197లలో 63.6 ఎకరాలను పీఓటీ కింద స్వాధీనం చేసుకుని హెచ్ఎండీఏకు అప్పగించారు. పది ఎకరాలు అర్బన్ ఫారెస్ట్రీ నర్సరీగా అభివృద్ధి చేసి, మిగిలిన భూములు హెచ్ఎండీఏ అధీనంలో ఉన్నాయి.

మహేశ్వరంలో..

మంఖాల్ రెవెన్యూ సర్వే నంబర్ 70లోని 8.28 ఎకరాలు, సర్వే నంబర్ 71లోని 6.01 ఎకరాలు, సర్వే నంబర్ 73లోని 4.35 ఎకరాలు, సర్వే నంబర్ 85లోని 1.34 ఎకరాలు, సర్వే నంబర్ 86లోని 1.24 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. 40 ఏళ్ల క్రితమే 12 మంది రైతులకు అప్పటి ప్రభుత్వం అసైన్డ్ చేసింది. ఈ భూములపై ఓ ప్రముఖ రియల్టర్ కన్నేశాడు. రైతులకు డబ్బుల ఆశ చూపి, పక్కనే ఉన్న తమ పట్టా భూముల్లో కలిపేశాడు. ఎక్కడ దొరికి పోతామోనని వెంచర్ మధ్యలో ఉన్న భూములను ఇచ్చిన ఆయా రైతులకు మరో చోట పొజిషన్ చూపించారు. తీరా ఆ భూములు అసైన్‌దారులకు దక్కకుండా మరికొంత మంది కబ్జా చేశారు. ఇటీవల ఇదే అంశంపై పెద్ద ఎత్తున వార్తా కథనాలు రావడంతో రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమైంది. ఆయా సర్వే నంబర్లలోని 23.22 ఎకరాల అసైన్డ్ భూములను పీఓటీ యాక్ట్ కింద స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించింది.



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, మనోహర్‌రెడ్డి

లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులు ప్రారంభించండి

షాద్‌నగర్: పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా షాద్‌నగర్ పరిధిలోని జిల్లేడు చౌదరిగూడ మండలంలో నిర్మించ తలపెట్టిన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, వెంటనే పనులు ప్రారంభించాలని షాద్‌నగర్, పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు అసెంబ్లీ హాల్‌లో ముఖ్యమంత్రిని కలిసి విన్నవించారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణ పనులు పూర్తయితే తాగు, సాగునీటి సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. అదేవిధంగా నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

పదేళ్ల బీఆర్ఎస్ పాలన అవినీతిమయం

పీసీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జితేందర్

ఆమనగల్లు: ప్రభుత్వం నుంచి ప్రతిపక్ష నాయకుడిగా అన్ని సౌకర్యాలు పొందుతున్న కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితమయ్యారని పీసీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వానికి సలహాలు అందించేందుకు అసెంబ్లీకి రావాలని కోరారు. పట్టణంలో శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ పదేళ్లపాలన అవినీతి, అక్రమాలతో సాగిందని ఆరోపించారు. కేసీఆర్, అతని కుటుంబ సభ్యుల అవినీతి అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో ప్రజాధనాన్ని దోచుకున్న కేసీఆర్‌కు ప్రజాకోర్టులో శిక్ష తప్పదన్నారు. బీఆర్ఎస్ నేతలకు ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి కాళేశ్వరం ప్రాజెక్టుపై చర్చించాలని ఆయన డిమాండ్ చేశారు. అప్పుల పాలైన రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గాడిలో పెడుతున్నారని చెప్పారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నట్టు తెలిపారు. ప్రజల అండదండలతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఘనవిజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో పీసీసీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్, రాష్ట్ర కార్యదర్శి కానుగుల దశరథం, రాష్ట్ర చెంచు యువజన సంఘం అధ్యక్షుడు మండ్లి రాములు, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

బాలాపూర్ గణనాథుడిని దర్శించుకున్న కేంద్ర మంత్రి



గణనాథుడి సన్నిధిలో కేంద్ర మంత్రి ప్రహ్లాద జోషి తదితరులు

బడంగ్‌పేట్: ప్రసిద్ధి చెందిన బాలాపూర్ గణనాథుడిని శనివారం కేంద్ర మంత్రి ప్రహ్లాద జోషి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి ఆయనను సత్కరించి లడ్డూ ప్రసాదం అందజేశారు. అనంతరం ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ.. మహా గణనాథుని ఆశీస్సులు దేశ ప్రజలందరిపై ఉండాలని, ప్రధాని మోదీకి మరింత శక్తి ప్రసాదించాలని కోరుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి రావినూతల శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



మాట్లాడుతున్న డీసీపీ రాజేష్

షాద్‌నగర్: సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చని శంషాబాద్ డీసీపీ రాజేష్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం కంసాన్‌పల్లిలో మాజీ వైస్ ఎంపీపీ బసిరెడ్డి నరేందర్‌రెడ్డి సొంత నిధులు రూ.3.50 లక్షలతో గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శనివారం డీసీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని పేర్కొన్నారు. గ్రామాల్లో అనుమానంగా సంచరించే వ్యక్తుల సమాచారం, అసాంఘిక కార్యకలాపాల సమాచారం పోలీస్ వారికి అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ లక్ష్మీనారాయణ, సీఐ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో గణితం, చరిత్ర బోధించే పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు పీజీలో సంబంధిత సబ్జెక్టుల్లో 50 శాతం, ఇతరులు 55 శాతం ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. పీహెచ్‌డీ, ఎన్‌టీపీ, సెట్, ఎస్ఎల్ఈటీ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హత కలిగిన వారు సెప్టెంబర్ 2వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 3న హయత్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మౌఖిక పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

గణేశుడితో పాటు బంగారు గొలుసు నిమజ్జనం



బంగారు గొలుసు అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది

తుర్కయంజాల్: గణనాథుడితో పాటు ఐదు తులాల బంగారు గొలుసు నిమజ్జనం చేసిన సంఘటన తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువు వద్ద శనివారం చోటు చేసుకుంది. నగరంలోని హస్తినాపురంలో నివసించే ఓ కుటుంబం ఇంట్లో ఏర్పాటు చేసిన వినాయకుడిని నిమజ్జనం చేసేందుకు మాసబ్ చెరువు వద్దకు వచ్చారు. పూజ చేసే సమయంలో వినాయకుడి మెడలో వేసిన ఐదు తులాల బంగారు గొలుసు తీయడం మరిచి జేసీబీ డ్రైవర్‌కు ఇవ్వడంతో అతను చెరువులో నిమజ్జనం చేశాడు. వెంటనే తేరుకున్న వారు నిమజ్జనం పాయింట్ వద్ద ఉన్న అధికారులకు సమాచారం అందించారు. జేసీబీ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి నిమజ్జనం చేసిన విగ్రహాలను బయటకు తీయగా గొలుసు దొరకడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



పూర్తిగా నిండి ప్రమాద స్థాయికి చేరిన చిలుకూరు పెద్ద చెరువు



జీవన్‌గూడ రోడ్డుపై ప్రవహిస్తున్న మాలకుంట అలుగునీరు

కాలువలు కబ్జా!

- చెరువుల నీళ్లు రోడ్లపైకి
- బ్యాక్ వాటర్‌లో మునిగిన పంటలు
- అధికారుల నిర్లక్ష్యంతో ముంపు ముప్పు

మొయినాబాద్: ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం.. అధికారుల నిర్లక్ష్య వైఖరి చిలుకూరు గ్రామానికి ప్రమాదం తెచ్చిపెట్టింది. చెరువు నిండి బ్యాక్‌వాటర్‌తో పంటలు మునిగి నష్టపోతున్నామని రైతులు ఆవేదన చెందుతుండగా.. నీళ్లు కిందికి వదిలితే ఇళ్లు కొట్టుకుపోతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు సమీపంలో పెద్ద చెరువు ఉంది. ఈ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి 69 ఎకరాల్లో విస్తరించి ఉంది. చెరువు కింద ఆయకట్టు సైతం ఉంది. గతంలో చెరువుకు రెండు తూములు, అలుగు ఉండేవి. అలుగు కింది భాగం నుంచి రోడ్డు ఉండడంతో అలుగుపై మట్టి పేరుకుపోయింది.

అలుగు కంటే అడుగు ఎత్తులో రోడ్డు నిర్మాణం

హిమాయత్‌నగర్– తంగడపల్లి ఆర్ అండ్ బీ రోడ్డు చిలుకూరు పెద్ద చెరువు కట్ట పైనుంచి ఉంది. గతంలో రోడ్డు వేసే క్రమంలో అధికారులు పెద్ద చెరువు అలుగు వద్ద ఒక అడుగు మేర ఎత్తు పెంచి నిర్మాణం చేపట్టారు. దీంతో అలుగుపై సైతం మట్టి పేరుకుపోయి ఒక అడుగు ఎత్తు పెరిగింది.

ఆయకట్టులో ఇళ్ల నిర్మాణం

పెద్ద చెరువు ఆయకట్టులో కొన్నేళ్లుగా ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. చెరువు కట్ట కింది భాగంలోనే ప్లాట్లు చేయడంతో కొనుగోలు చేసినవారు ఇళ్లు నిర్మించుకున్నారు. అప్పట్లో అలుగు నుంచి కిందికి వెళ్లే నీళ్ల కాలువ ద్వారా గండిపేట చెరువులోకి చేరేవి. అలుగు నీళ్లు వెళ్లే కాలువను పూడ్చేసి రోడ్డు వేశారు. దీంతో చెరువు నిండితే కిందికి వెళ్లడానికి కాలువలేకుండా పోయింది. ప్రస్తుతం రోడ్డుపై నీరు చేరి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రమాద స్థాయికి చేరిన చెరువు

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువు పూర్తి స్థాయిలో నిండింది. రోడ్డు నిర్మాణంతో అలుగు ఎత్తు ఒక అడుగుకు పైగా పెరగడంతో అదే ఎత్తుకు నీళ్లు చేరి రోడ్డుపైనుంచి ప్రవహిస్తున్నాయి. 69 ఎకరాల ఎఫ్‌టీఎల్ పరిధి దాటి 100 ఎకరాల వరకు బ్యాక్ వాటర్ చేరింది. బ్యాక్ వాటర్‌లో రైతుల పంటలు మునిగిపోయాయి. మూడు రోజుల క్రితం అదనపు కలెక్టర్ శ్రీనివాస్ చెరువును పరిశీలించి శాశ్వత పరిష్కారం కోసం నాలా నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

ఎనికేపల్లి మాలకుంట నిండడంతో..

మున్సిపాలిటీ పరిధిలోని ఎనికేపల్లిలో ఉన్న మాలకుంట పూర్తిస్థాయిలో నిండి అలుగు పారుతోంది. అలుగు కింది భాగంలో మాలకుంట నుంచి బంగాలి కుంటలోకి నీరు వెళ్లేందుకు కాలువ ఉండేది. ఆ కాలువను గతంలో రియల్ వ్యాపారులు కబ్జాచేసి ప్రహరీ నిర్మించారు. దీంతో అలుగు నుంచి వెళ్తున్న వరద నీరంతా జీవన్‌గూడ వెళ్లే రోడ్డుపై ప్రవహిస్తూ పంటచేలల్లోకి వెళ్తోంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అధికారులకు సూచించాం

చిలుకూరు పెద్ద చెరువు అలుగు వద్ద రోడ్డు ఎత్తును తగ్గించాలని ఆర్ అండ్ బీ అధికారులకు సూచించాం. అలుగు నీరు వెళ్లేందుకు వీలుగా నాలా నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అడిషనల్ కలెక్టర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఎనికేపల్లి మాలకుంట నుంచి బంగాలి కుంటకు అలుగు నీరు వెళ్లే కాలువ కబ్జాకు గురైంది. కాలువను సర్వే చేయాలని మండల సర్వేయర్‌కు లేఖ రాశాం.

– పరమేశ్వర్, ఇరిగేషన్ డీఈ, చేవెళ్ల డివిజన్

న్యాయవ్యవస్థపై విశ్వాసం పెంపొందించాలి

జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి కరుణకుమార్



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రధాన న్యాయమూర్తి కరుణకుమార్

ఆమనగల్లు: న్యాయవ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేందుకు న్యాయవాదులు కృషి చేయాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి కరుణకుమార్ అన్నారు. పట్టణంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శనివారం ఆమనగల్లు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ జీవన్ హాస్పిటల్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అంతకుముందు ఆయనకు ఆమనగల్లు జడ్జి కాటం స్వరూప, బార్ అసోసియేసన్ అధ్యక్షుడు యాదీలాల్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం కోర్టు ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన క్యాంటిన్, జిరాక్స్ సెంటర్‌ను ప్రారంభించారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బార్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కరుణకుమార్ మాట్లాడుతూ.. పట్టణంలో కోర్టు ఏర్పాటుకు అవసరమైన స్థలం సమకూరితే నూతన భవనం ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. అదనపు కోర్టు ఏర్పాటుకు సహకరిస్తానని తెలిపారు. షాద్‌నగర్ సబ్‌కోర్టు పరిధిలో ఉన్న ఆమనగల్లు జూనియర్ సివిల్‌జడ్జి కేసులను మహేశ్వరం కోర్టుకు మార్చడానికి హైకోర్టుకు నివేదిస్తానని చెప్పారు. చట్టాలు, న్యాయవ్యవస్థపై బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం జడ్జి కరుణకుమార్‌ను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీపీ కార్తీక్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు జగన్, లక్ష్మణశర్మ, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులుయాదవ్, సభ్యులు, సీఐలు జానకీరాంరెడ్డి, వేణుగోపాల్, ఎస్ఐలు వెంకటేశ్, శ్రీకాంత్, వరప్రసాద్, సీతారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తూర్పు–పడమర కలిసేలా..

శ్రీశైలం హైవే టు సాగర్‌హైవే వరకు ట్రంక్ రోడ్డు నిర్మాణం

- సిగ్నల్ రహిత జంక్షన్లు, ఇంటర్ ఛేంజ్‌లతో పటిష్టమైన వ్యవస్థ
- సరుకు రవాణా, మెట్రో కనెక్టివిటీలతో మెరుగైన మౌలిక సదుపాయాలు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఇండియాకే తలమానికంగా నిలిచేలా భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలను సాకారం చేసే దిశగా అడుగులు శరవేగంగా పడుతున్నాయి. ఫోర్త్ సిటీని కేవలం ఉద్యోగ, ఉపాధి అవకాశాల కేంద్రంగానే కాకుండా అంతర్జాతీయ ఎగుమతులకు వీలుండేలా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు తూర్పున శ్రీశైలం హైవే (ఎన్‌హెచ్–765) నుంచి పశ్చిమాన ఉన్న నాగార్జున సాగర్ హైవే (స్టేట్ హైవే–19) వరకూ గ్రీన్‌ఫీల్డ్ ట్రంక్ రోడ్డును నిర్మించనున్నారు. ఈ ప్రతిపాదిత రహదారి వయా ఫ్యూచర్ సిటీ మీదుగా వెళ్తుంది. గతంలోనే కందుకూరు నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు చేపట్టిన ఈ రోడ్డు నిర్మాణ పనులను త్వరలోనే పూర్తి చేసేలా ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక తయారు చేసింది. మీర్‌ఖాన్‌పేట నుంచి నందివనపర్తి మీదుగా యాచారం మండలం కేంద్రంలోని నాగార్జునసాగర్ హైవేకు లింకు చేసే పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టేందుకు కసరత్తు చేస్తోంది. మీర్‌ఖాన్‌పేటలో స్కిల్స్ యూనివర్సిటీ, ఎఫ్‌సీడీఏ కార్యాలయం, ఏటీసీ సెంటర్ సహా పలు సంస్థలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నందున ఈ లింక్ రోడ్డుకు ప్రాధాన్యం ఇస్తోంది. అదే సమయంలో రావిర్యాల ఔటర్ ఎగ్జిట్ నుంచి ప్రతిపాదించి 330 అడుగుల రతన్ టాటా గ్రీన్‌ఫీల్డ్ రహదారి కూడా ఇక్కడి నుంచే ముందుకు సాగుతున్నందున.. ఈ ప్రాంతం అన్నింటికీ హబ్‌గా మారుతుందని అంచనా వేస్తోంది.

భూ సేకరణ ఇబ్బందులు లేకుండా..

ఫ్యూచర్ సిటీలో అత్యంత కీలకం మౌలిక సదుపాయాల అభివృద్ధే. అందుకే భవిష్యత్తు నగరి చుట్టూ గ్రీన్‌ఫీల్డ్ రహదారులను నిర్మించనున్నారు. ఈ మేరకు శ్రీశైలం హైవేను సాగర్ హైవేతో అనుసంధానించనున్నారు. తెలంగాణ ప్రభుత్వం పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) ఈ రోడ్డును నిర్మించనుంది. ఈ కారిడార్ ఎఫ్‌సీడీఏ కింద అభివృద్ధి చేస్తున్న కీలక పారిశ్రామిక ప్రాంతాల గుండా వెళ్తుంది. దీంతో సమతుల్య పట్టణ వృద్ధి సాధ్యమవుతుంది. ప్రణాళికాబద్ధమైన పట్టణ పారిశ్రామిక ప్రాంతంలో ప్రధానమైన క్రాస్ యాక్సెస్‌కు అవకాశం కల్పిస్తుంది. తూర్పు–పడమర ట్రంక్ రోడ్డు పారిశ్రామిక మండలాలు, లాజిస్టిక్స్ హబ్‌లు, నివాస ప్రాంతాలను కలుపుతుంది. భూ సమీకరణ ఇబ్బందులు తలెత్తకుండా అభివృద్ధి చెందని, ప్రభుత్వ యాజమాన్యంలోని భూమిని ఉపయోగిస్తూ ఈ రహదారిని నిర్మించనున్నారు.

తగ్గనున్న రద్దీ భారం

ఈ రోడ్డు తూర్పు–పశ్చిమ ప్రాంతాలను అనుసంధానం చేయడంతో పాటు ఆయా ప్రాంతాలు, రహదారులలో రద్దీని తగ్గిస్తుంది. అలాగే చుట్టుపక్కల రోడ్డు నెట్‌వర్క్‌లపై భారాన్ని తగ్గిస్తుంది. మల్టీ మోడల్, హైస్పీడ్ కనెక్టివిటీ మరింత మెరుగవుతుంది. సున్నితమైన, అంతరాయం లేని ప్రయాణం సాగించేలా ఈ కారిడార్‌ను నిర్మించనున్నారు. వంకలు లేకుండా, మెరుగైన విజిబులిటీ, ప్రధాన జంక్షన్లలో ఎత్తయిన విభాగాలు, హైస్పీడ్ కదలికలను నిర్ధారించే డిజైన్స్‌తో అంతర్జాతీయ స్థాయిలో ఈ రహదారిని అభివృద్ధి చేయనున్నారు. భవిష్యత్తు సామూహిక రవాణా వ్యవస్థలు, యుటిలిటీ కోసం ప్రత్యేక స్థలాలతో పటిష్టమైన మౌలిక సదుపాయాలతో ఉంటుంది. ట్రాఫిక్ ఫ్లో, యాక్సెసబులిటీ కోసం ప్రధాన క్రాసింగ్ పాయింట్ల వద్ద ఇంటర్‌ఛేంజ్‌లను ప్రతిపాదించారు. నగరాల మధ్య వేగవంతమైన వాహన కదలికలు, సరుకు రవాణా, మెట్రో కనెక్టివిటీతో పాటు సిగ్నల్ రహిత జంక్షన్లతో సమర్థవంతమైన ప్రజా మౌలిక సదుపాయాల విస్తరణను సులభతరం చేస్తుంది.

విద్యార్థులు ఏకాగ్రత కోల్పోవద్దు

హైకోర్టు న్యాయమూర్తి నర్సింగ రావు



జ్యోతిప్రజ్వలనలో న్యాయమూర్తి తదితరులు

శంకర్‌పల్లి: న్యాయ విద్యను అభ్యసించే విద్యార్థులు ఏకాగ్రతను కోల్పోవద్దని హైకోర్టు న్యాయమూర్తి నందికొండ నర్సింగ రావు అన్నారు. శుక్రవారం రాత్రి శంకర్‌పల్లి మండలం దొంతాన్‌పల్లిలో ఇక్ఫాయ్ డీమ్డ్ విశ్వవిద్యాలయం 'లా స్కూల్' ఆధ్వర్యంలో ఎస్.జె.యశస్వీ మెమోరియల్ 10వ మూట్ కోర్టు పోటీలను ప్రారంభించారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ పోటీల్లో.. దేశంలో పేరుగాంచిన 37 లా కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. కళాశాల దశలో ఏర్పాటు చేసిన ఈ మూట్ కోర్టు పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్కూల్ డైరెక్టర్ డా.రవిశేఖర రాజు మాట్లాడుతూ.. పాఠశాలలో చేపడుతున్న కార్యక్రమాలు, వాటివిశిష్టతను వివరించారు. కార్యక్రమంలో స్కూల్ డీన్ ప్రతాప రెడ్డి, టోర్నీ కొ– ఆర్డినేటర్ డా.టి.హిమావతి తదితరులు పాల్గొన్నారు.

పొలంలో పడి వ్యక్తి మృతి



చంద్రయ్య(ఫైల్)

కేశంపేట: ప్రమాదవశాత్తు వరిపొలంలో పడిన వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధి చింతకుంటపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. వేముల్‌నర్వకు చెందిన చంద్రయ్య(45) మద్యానికి బానిసై జులాయిగా తిరిగేవాడు. భర్త తాగుడును భరించలేక భార్య మంజుల పదేళ్ల క్రితం అతడిని వదిలి, పిల్లలతో కేశంపేటలో నివసిస్తోంది. చంద్రయ్య మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న కుటుంబీకులు ఘటనా స్థలానికి వచ్చి, మృతదేహాన్ని గుర్తించారు. ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెంది ఉంటాడని పోలీసులు, కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. మృతుడి సోదరుడు శ్రీను ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గొలుసు దొంగలున్నారు.. జాగ్రత్త

సీఐ విజయ్‌కుమార్



షాద్‌నగర్‌రూరల్: ఏమార్చి ఆభరణాలను అపహరించే దొంగలు ఉన్నారని, వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని పట్టణ సీఐ విజయ్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడారు. నలుగురు సభ్యులు ముఠాగా ఏర్పడి ద్విచక్రవాహనాలపై వచ్చి బంగారు గొలుసులను దోచుకెళ్తున్నారని తెలిపారు. ఆ ముఠా సభ్యులు తమిళ యాసలో తెలుగులో మాట్లాడుతూ.. రోడ్డుపై వెళ్లే వారిని ఆపి తాము పోలీసులమని, బంగారం మెడలో వేసుకొని తిరగొద్దని, చోరీలు జరుగుతున్నాయని నమ్మిస్తున్నారని వివరించారు. ఆ తరువాత వారిని మాటల్లో పెట్టి, మెడలో నుంచి గొలుసు తీసుకొని మూట కట్టిస్తామని ఓ పేపర్‌లో చుట్టినట్లుగా నమ్మించి సొమ్ముతో బైక్‌పై పరారవుతారని వెల్లడించారు. ఈ తరహా దొంగతనాలు మహబూబ్‌నగర్ పట్టణంతో పాటు, రూరల్ ప్రాంతాల్లో జరుగుతున్నాయన్నారు. అలాంటి ముఠా ఈ ప్రాంతానికి వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని, వారిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

PUBLIC NOTICE

The General Public is hereby informed that our client intends to purchase land admeasuring **Ac 0-07 Gts (Out of Ac. 0-28 Gts)** in various sub-divisions of Survey No. **722/A/1/2** situated at Mahalingapuram village (Previously Dhobipet Village), Shankerpally Mandal and Ranga Reddy District, Telangana from their respective owners more fully described in the table given in the Schedule below **("SCHEDULE OF PROPERTY").** The Owner has represented that he is the absolute owner and exclusive possessor of the Schedule Property shown against his name in the Schedule below and having unrestricted and absolute rights to sell, transfer, mortgage or otherwise deal with the Schedule properties shown against his name.

Any person(s) having or asserting any right, title, claim or interest of any nature whatsoever or in relation to the Schedule of Property or any portion thereof is/are hereby called upon to file their claims/objection(s) with the undersigned along with supporting documents, within 7 (seven) days from the date of this notice If no claim/objection is received within the said period, the transaction of the Schedule Property will be completed, without any reference to such claim, as if claim non-existent and/or waived.

SCHEDULE OF PROPERTY: TABLE 1

SL. NO.	OWNERS	SURVEY NUMBER	EXTENT AC- GTS	SALE DEED/ TITLE DEED
1.	Machanagari @ M. Padma W/o. Prabhaker Reddy	722/A/1/2	Ac. 0-07 Gts	Pattadar Passbook No. T05240011871
	TOTAL		Ac. 0-07 Gts	

BORAMPETA MANISHA REDDY, Advocate
H.No. 6-91/2, Beside Manik Prabhu Madir, Mahalingapuram Village, Shankerpally Mandal, Ranga Reddy District, PIN- 500032. Mobile +919515725302.

బస్సులోంచి పడి.. కేర్ టేకర్‌కు గాయాలు



రోడ్డుపై పడిపోయిన నర్సింహులు

శంకర్‌పల్లి: కదులుతున్న పాఠశాల బస్సులో నుంచి ప్రమాదవశాత్తు కేర్ టేకర్ పడిపోయాడు. ఈ సంఘటన శనివారం శంకర్‌పల్లి పట్టణంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. సింగాపురం గ్రామానికి చెందిన నర్సింహులు(45), పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాల బస్సులో కేర్ టేకర్‌గా పని చేస్తున్నాడు. శనివారం సాయంత్రం 3.30 గంటలకు స్కూల్ ముగిసిన తర్వాత విద్యార్థులను తీసుకొని బస్సులో వెళ్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యలో రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద నర్సింహులు అకస్మాత్తుగా బస్సులో నుంచి రోడ్డుమీద పడిపోయాడు. ఈ ఘటనంలో సదరు వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా.. స్థానికులు దగ్గరలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఫిట్స్ రావడంతో బాధితుడు కింద పడిపోయాడని వైద్యులు గుర్తించి, వైద్యం అందిస్తున్నారు.

అండగా నిలిచి.. వైద్యం చేసి

ఔటర్, సర్వీస్ రోడ్ల పై ప్రమాదాల బారిన పడుతున్న వారికి ట్రామా కేర్ సెంటర్లు అండగా నిలుస్తున్నాయి. సకాలంలో వైద్య సేవలు అందించి ప్రాణాలు నిలుపుతున్నాయి. రింగురోడ్డు చుట్టూ ఏర్పాటు చేసిన 16 కేంద్రాల ద్వారా నాలుగేళ్లుగా వందలాంది మంది క్షతగాత్రులకు వైద్య చికిత్స అందిస్తున్నారు.

- రోడ్డు ప్రమాద బాధితులకు వరంగా ట్రామా కేర్ సెంటర్లు
- క్షత్రగాత్రుల ప్రాణాలు నిలుపుతున్న వైనం
- నాలుగేళ్లుగా వందలాది మందికి సేవలు
- ప్రజాసేవలో ఓఆర్ఆర్ చుట్టూ 16 కేంద్రాలు



తుక్కుగూడ ఓఆర్ఆర్ టోల్ వద్ద ట్రామా కేర్ సెంటర్

తుక్కుగూడ: ట్రామా కేర్ సెంటర్లతో క్షతగాత్రులకు సకాలంలో ప్రథమ చికిత్స అందుతోంది. ఔటర్ రింగు రోడ్డు(ఓఆర్ఆర్)లో నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు చోట్టు చేసుకుంటున్న నేపథ్యంలో బాధితులకు సత్వర వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో నిర్వాహకులు కేర్ కేంద్రాలను నెలకొల్పారు. ఓ ప్రైవేటు ఆస్పత్రి ఆధ్వర్యంలో నిరంతరం సేవలను కొనసాగిస్తున్నారు.

ట్రోల్స్ కార్యాలయాల్లో కేంద్రాలు

ఔటర్ చుట్టూ 19 ట్రోల్స్‌ను ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన కార్యాలయాల్లోనే 16 ట్రామా కేర్ సెంటర్లను కొనసాగిస్తున్నారు. ఇప్పటి వరకు శంషాబాద్, పెద్దగోల్‌కొండ, తుక్కుగూడ, రావిర్యాల, బొంగ్లూర్, పెద్దఅంబర్‌పేట, తారమతిపేట, ఘటుకేసర్, శామీర్‌పేట, మేడ్చల్, అప్పాజంక్షన్, పటాన్‌చెరువు, దుండిగల్‌లో నాలుగేళ్ల క్రితం కేంద్రాలను ప్రారంభించారు.

అందుబాటులో వైద్య సేవలు

ట్రామా కేర్ సెంటర్ల ద్వారా ఔటర్ రింగు రోడ్డు, సర్వీస్ రోడ్డులో ప్రమాదాలకు గురైన వారికి ప్రథమ చికిత్స అందిస్తున్నారు. ప్రథమ చికిత్స చేయడానికి వైద్య సిబ్బంది, బెడ్లు, ఆక్సిజన్, పరికరాలు బీపీ కొలమానం తదితర సామగ్రి అందుబాటులో ఉంటాయి. క్షతగాత్రులను తీసుకురావడానికి అంబులెన్స్ సౌకర్యం ఉంటుంది. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలను అందించడానికి డ్యూటీలో ఉన్న సిబ్బంది నగరంలోని పెద్ద ఆస్పత్రులకు తరలిస్తారు. గాయపడిన వారికి వైద్య సేవలు అందించడంలో సెంటర్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి.

ప్రథమ చికిత్స అందిస్తారు



ఓటర్‌లో ప్రమాదాల బారిన పడిన వారి కోసం అపోలో, యశోద ఆస్పత్రి ఆధ్వర్యంలో ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో ఎక్కడో ఓ చోట నిత్యం వాహనదారులు ప్రమాదంలో పడుతుంటారు. వారికి ఇక్కడ ప్రథమ చికిత్స చేసి, ఆరోగ్య పరిస్థితిని బట్టి అపోలోకు తరలిస్తాం.

– నరేష్, ట్రామా ఉద్యోగి

సేవలు భేష్



ప్రమాదాల బారిన పడిన క్షతగాత్రులకు ఓఆర్ఆర్ ట్రోల్ సెంటర్ల వద్ద ఉన్న ట్రామా కేర్ సెంటర్ల ద్వారా వైద్య చికిత్స అందిస్తున్నారు. తక్షణమే అందుతున్న వైద్య సేవల ద్వారా ఎంతో మంది ప్రాణాలు నిలబడుతున్నాయి. సెంటర్ సేవలు చాలా బాగున్నాయి.

– శేఖర్‌గౌడ్, ఓఆర్ఆర్ ఉద్యోగి

ఉద్యమకారులను ఆదుకోవాలి

సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి

షాద్‌నగర్: తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్‌ను నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమకారులు స్వరాష్ట్ర సాధనకు తమ జీవితాలను, సమయాన్ని ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాటం చేశారని, కానీ గత పాలకులు వారిని పట్టించుకోలేదని ఆరోపించారు. ఉద్యమకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి ఉద్యమంలో పాల్గొన్న వారికి ఇంటి స్థలాలను ఇవ్వడంతో పాటు గౌరవ భృతిని చెల్లించాలన్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిని శాలువాతో ఘనంగా సత్కరించారు.

రాత్రి అరుపులు.. పగలు దాడులు



వీధి కుక్కల బెడద తగ్గించేందుకు ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చిస్తున్నా కుక్కకాటు తప్పడం లేదు. ప్రజలకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. నిత్యం ఎక్కడో ఓ చోట బాధితులు ఆస్పత్రులకు పరుగులు పెడుతూనే ఉన్నారు. గతంలో రేబిస్ సోకి చనిపోయిన ఘటనలు లేకపోలేదు.

పిక్కలు పీకుతున్న కుక్కలు

- పెరిగిపోతున్న కుక్కకాటు బాధితులు
- ఆస్పత్రులకు క్యూ కడుతున్న జనం
- ప్రతీ నెల వందల సంఖ్యల్లో కేసులు

నాలుగు నెలల్లో 39 కేసులు



ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ బుస్రాఫాతిమా

కొడంగల్ రూరల్: అంగడిరాయిచూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుక్క కాటుకు సంబంధించిన మందులతో పాటు సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ బుస్రా ఫాతిమా తెలిపారు. శనివారం మండల పరిధిలోని అంగడిరాయిచూర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాగ్ బైట్స్‌కు సంబంధించిన వివరాలను కోరగా కుక్క కాటుకు గురైనవారికి ఐదు డోసుల ట్రీట్‌మెంట్ ఇస్తామన్నారు. 0, 3, 7, 14, 28 రోజులలో ఐదు డోసులుగా మందులను అందిస్తున్నామని, మేలో తొమ్మిది, జూన్‌లో 13, జూలైలో ఎనిమిది, ఆగస్టులో తొమ్మిది కేసులు నమోదయ్యాయని చెప్పారు.

మూడేళ్ల వ్యవధిలో 6,370 కేసులు



వీధి కుక్క దాడిలో ఓ వ్యక్తి కాలికి గాయం

తాండూరు: తాండూరు పట్టణంలో వీధి కుక్కలు బెడద తీవ్రంగా ఉంది. ప్రతి రోజు ఏదో ఒక ప్రాంతంలో వీధికుక్క కాటుకు బలవుతున్నారు. ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో తాండూరు నియోజకవర్గంతో పాటు ఇతర మండలాల నుంచి ఈ తరహా కేసులు పెద్ద ఎత్తున నమోదయ్యాయి. ఈ ఏడాది మే–ఆగస్టు వరకు 1,135 కుక్క కాటు కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలుస్తోంది. 2023 జనవరి – 2025 ఆగస్టు నెలాఖరు వరకు 6,370 కుక్క కాటు కేసులు నమోదయ్యాయని జిల్లా ఆసుపత్రి వర్గాలు ధృవీకరించాయి. ఇక్కడ కుక్కకాటుకు సరిపడ రేబిస్ మందులు అందుబాటులో ఉన్నాయని వైద్యులు తెలుపుతున్నారు. తాండూరు మున్సిపల్ పరిధిలోని పాత తాండూరు, గొల్ల చెరువు, గాంధీనగర్, ఇందిరానగర్, మల్‌రెడ్డిపల్లి, రాజీవ్‌కాలనీ, సాయిపూర్ ప్రాంతాల్లో వీధికుక్కలు బారిన పడిన కేసులు ఎక్కువవగా నమోదయ్యాయి. ఇందులో చిన్నారులే అధికం. ఇటీవల పెంపుడు కుక్కలు సైతం యజమాని కుటుంబీకుల పిక్కలు పీకుతున్నాయి. తాండూరు పట్టణంలో పెంపుడు కుక్క ఓ చిన్నారిని కరవడంతో ప్రాణాలే కోల్పోయింది.

మాంసపు దుకాణాల వద్ద వీధి కుక్కల గుంపులు

పట్టణంలో ఇటీవల మాంసపు దుకాణాలు విపరీతమయ్యాయి. దీంతో వీధి కుక్కలు మాంసపు దుకాణాల వద్ద గుంపులుగా చేరుతున్నాయి. వాటికి అలవాటు పడిన వీధి కుక్కలు మాసం దొరకని సమయంలో రోడ్లపై పోయేవారినపై దాడులకు పాల్పడుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కలను అరికట్టేందుకు మున్సిపల్ అధికారులు కొన్ని రోజుల పాటు నియంత్రణ కార్యక్రమం చేసి మధ్యలోనే వదిలేశారని ఆరోపిస్తున్నారు. దీంతో మళ్లీ వీధి కుక్కలు బారిన పడాల్సి వస్తోందని వాపోతున్నారు.

పట్టుకున్న చోటే వదిలేస్తున్నారు

మీర్‌పేట: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వీధి కుక్కల దాడులతో జనం ఆందోళన చెందుతున్నారు. శస్త్ర చికిత్సల పేరిట వీధి కుక్కలను పట్టుకెళ్లడం ఆపరేషన్లు చేయడం మరలా పట్టుకున్న చోటే వదిలేయడంతో రాత్రి వేళ అరుపులు... పగటి పూట దాడులకు పాల్పడుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కలకు ఆపరేషన్లు చేయడం తప్ప నియంత్రణకు మున్సిపల్ యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

మూడు నెలల్లో 350కి పైగా కేసులు

బాలాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వీధి కుక్కల దాడి ఘటనలు ఎక్కువగానే ఉన్నాయి. గత మూడు నెలల్లో దాదాపు 350కి మందికి పైగా కుక్కల దాడిలో గాయపడ్డారని, ఆస్పత్రికి వచ్చిన వారందరికి వ్యాక్సిన్లు వేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. కుక్కకాటుకు సంబంధించిన వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి.

నెలకు 30కి పైగా బాధితులు

మోమిన్‌పేట: మండల పరిధిలోని గ్రామాల్లో నెలకు 30కి పైగానే కుక్క కాటు బాధితులు ఉన్నారు. ప్రతీ గ్రామంలో వందకు పైగానే కుక్కలు ఉన్నాయి. జూన్, జూలై, ఆగస్టు నెలలో వరుసగా 41, 38, 36 మంది కుక్కల కాటుకు గురైనట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. కేవలం ప్రాథమిక ఆసుపత్రికి వచ్చిన వారే. ఇంకా కొంత మంది ప్రైవేట్, ఇతర జిల్లా ఆసుపత్రులకు వెళ్లిన వారు అదనం.

షాద్‌నగర్‌లో ఆస్పత్రికి బాధితుల క్యూ



కుక్క కాటుకు గురైన వెలిజర్ల గ్రామస్తుడు (ఫైల్)

షాద్‌నగర్: ఒకప్పుడు వీధి కుక్క లను గ్రామ సింహాలుగా, గ్రామ రక్షకులుగా అభివర్ణించేవారు. ప్రస్తుతం కుక్కలంటేనే జనం బెంబేలెత్తుతున్నారు. గతంలో పిచ్చి వచ్చిన కుక్కలు మాత్రమే కరిచేవి. ప్రస్తుతం మనుషులు కనిపిస్తే చాలు వారి పిక్కలు పీకుతున్నాయి. ఫలితంగా కుక్క కాటు బాధితులు ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు.

ఒక్క నెలలో 170 కేసులు నమోదు

పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో ఆగస్టు మాసంలో 170 కుక్క కాటు కేసులు నమోదయ్యాయి. పట్టణంతో పాటుగా, వివిధ గ్రామాలకు చెందిన కుక్క కాటు బాధితులు ఆసుపత్రికి వచ్చి చికిత్సలు చేయించుకుంటున్నారు. జూలైలో 195 కుక్క కాటు, మూడు పిల్లి కాటు, 12 పాముకాటు కేసులు నమోదైనట్లు వైద్యాధికారులు తెలిపారు.

కుక్కలకు 'ఏబీసీ'

వీధి కుక్కల బెడద నివారణకు షాద్‌నగర్ మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందుకు పట్టణ శివారులో ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశారు. కాలనీల్లోని కుక్కలను పట్టుకెళ్లి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించి యాంటి రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్నారు.

అందుబాటులో మందులు

కుక్క, పాము కాట్లకు సంబంధించిన అన్ని రకాల మందులు ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయి. కుక్క కాటు బాధితులుంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకోవాలి.